క్లుప్తంగా

పట్టణ సీఐ మల్లికార్జునరావు బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె పట్టణ సీఐగా ఎ.మల్లికార్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రేపల్లె రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తూ పట్టణ సీఐగా బదిలీ అయ్యారు. రేపల్లె పట్టణ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న నజీర్‌బేగ్ గుంటూరు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తానని నంతరం కార్యాలయ సిబ్బంది సీఐ మల్లికార్జునరావుకు పుష్ప గుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట



బోలాయపాలెం(కర్లపాలెం): గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి బోగేశ్వరశర్మ శిష్య బృందం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రతిష్టా మహోత్సవ పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గవ్యాంత పూజలు, మార్జనలు, పీఠ పూజ, గర్తన్యాసం, రత్నన్యాసం, యజ్ఞస్థాపన, ధ్వజ స్థాపన, బింబస్థాపనలు, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం, మహదాశీర్వచనం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



నగరం: నగరం గ్రామ దేవత పక్కలమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా తొలిరోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, దీక్ష అఖండ స్థాపన, మంగళ స్నాన కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రయుక్తంగా జరిపారు. అనంతరం ప్రత్యేక వాహనంపై విఘ్నేశ్వరుడు, అయ్యప్ప, కుమారస్వామి విగ్రహాలను నగరం పురవీధులలో గ్రామోత్సవం చేశారు. మేళ తాళాలతో స్వామివార్ల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. 10న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



బాపట్లటౌన్: పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కంకటపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మొలకలపల్లి శ్రీనివాసరావు (46) గురువారం ఉదయం పొలం పనులకు పొలం వెళ్లారు. పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికీ మృతి అతను చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

వర్మి కంపోస్ట్ విక్రయించేలా చర్యలు



తెనాలిఅర్బన్: మున్సిపల్ పరిధిలోని వర్మి కంపోస్ట్ యూనిట్‌లో ఉత్పత్తి అయిన కంపోస్టును నగర దీపికలు ఇంటింటికీ వెళ్లి విక్రయించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపోస్ట్ యూనిట్‌లో మూడు టన్నుల ఉత్పత్తి ఉందన్నారు. అది మొక్కల పెరుగుదలకు దోహదపతుందని చెప్పారు. దానిని విక్రయించటం వల్ల మున్సిపాలిటీకి కొంత ఆదాయం కూడ సమకూరుతుందని చెప్పారు. అనంతరం కుక్కల శస్త్ర చికిత్సాలయంను పరిశీలించారు. ఆవరణలోని వర్షపు నీటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. రెండురోజుల్లో కుక్కలకు శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, డీఈ నాగభూషణం తదితరులు ఉన్నారు.

పేరెంట్స్ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

చెరుకుపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి టి.నవీన్ కుమార్ తెలిపారు. మండలంలో 6 జెడ్పీ ఉన్నత, 7 ప్రాథమికోన్నత, 52 ప్రాథమిక పాఠశాలలకు గురువారం పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అయితే మండలంలోని కొన్ని పాఠశాలల్లో జరుగుతున్న పేరెంట్స్ కమిటీ ఎన్నికల వివరాలు పిల్లల తల్లిదండ్రులకు తెలియకపోవడం గమనార్హం. మండలంలో విద్యార్థులు ఎక్కువగా ఉన్న గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్ గా షేక్ సుభాని, వైస్ ఛైర్మన్‌గా విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల గ్రామ నాయకులు ఉప్పాల సాంబ శివరావు, వంగర శ్రీనివాస చక్రవర్తి, కాటూరి ఏడుకొండలు, దేశమాల సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాలల్లో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వారిని ఘనంగా సత్కరించారు.



పెసర్లంక హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రశాంతంగా కమిటీ ఎన్నికలు

నగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఇన్‌చార్జ్ ఎంఈఓ పి.లాజర్ తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 78 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 77 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయన్నారు. తాడివాకవారి పాలెం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఒకే విద్యార్థి ఉండటం ఆ విద్యార్థి తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఎన్నికలు నిర్వహించలేదన్నారు. మిగిలిన అన్ని పాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని వివరించారు.

భట్టిప్రోలులో ప్రశాంతం..

భట్టిప్రోలు: మండల పరిధిలోని 41 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 5 జెడ్పీ, 2 ఎయిడెడ్ హైస్కూల్స్‌లో గురువారం విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక పరిషత్ ప్రాథమిక పాఠశాల (బీఆర్) విద్యా కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లుగా దీపాల బాలతేజశ్రీ, ఎస్. తిరుపతయ్య ఎన్నికయ్యారు. అలాగే సభ్యులుతో హెచ్‌ఎం ఎస్కే హుస్సేన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీ సుబ్బారావు, జి.మల్లికార్జునరావు, జి.వాణి పాల్గొన్నారు. అలాగే పెసర్లంక దేవభక్తుని కోటయ్య హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్‌గా డి. శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా వి. మౌనిక ఎన్నికయ్యారు. వీరితో పాటు సభ్యులతో ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఛైర్మన్‌గా కట్టుపల్లి ఆనందబాబు, వైస్ ఛైర్మన్‌గా గుడిపల్లి రేవతి ఎన్నికయ్యారు. సభ్యులతో కె. అరుణ కుమారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జా రవి, ఉపాధ్యాయులు రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.



గుళ్లపల్లి హైస్కూల్ నూతన ఛైర్మన్ సుభానీని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

కర్లపాలెం: మండలంలో శుక్రవారం పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో-2 విజయశ్రీ తెలిపారు. ఈ ఎన్నికలను వైఎస్సార్ సీపీ నాయకులు పట్టించుకోక పోవటంతో టీడీపీ నాయకులే దగ్గరుండి వారు బలపరిచిన వ్యక్తులే కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే విధంగ పావులు కదిపారు. మండలంలో మొత్తం 48 ప్రాథమిక పాఠశాలలు ఉండగా వాటిలో 46 పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్‌లను ఎన్నుకున్నారు. నర్రావారిపాలెం పంచాయతీ కట్టావాద గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఛైర్మన్ ఎన్నిక అనివార్య కారణాల వల్ల శుక్రవారం జరగలేదని శనివారం తిరిగి నిర్వహిస్తామని ఎంవో తెలిపారు. సమ్మెటవారిపాలెం పంచాయతీ పరిధిలోని పేరలి కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవటంతో ఎన్నిక జరగలేదని ఆమె తెలిపారు. మండల పరిధిలో ఉన్న మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఎన్నికలు జరిగాయని ఎంఈవో తెలిపారు.

కమిటీ ఎన్నికలు ప్రశాంతం

రేపల్లె రూరల్: పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పలు ప్రభుత్వ పాఠశాలలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కేసనశెట్టి సురేష్ మాట్లాడుతూ మండలంలోని 59 పాఠశాల్లో కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయన్నారు. ఎన్నికై న కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్లటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి జి. వాణి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల మెడికల్ విభాగం సహకారంతో గురువారం మండలంలోని కృపానగర్ ఎస్టీ కాలనీ, వెదుళ్ళపల్లి పంచాయతీ సువార్తపురం, ఎస్టీ కాలనీ లైబ్రరీ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జి. వాణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాలు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకొని, వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉచిత న్యాయ సహాయానికి సంబంధించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ సేవలను ప్రజలకు తెలియజేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జె.హస్మప్రియ, డాక్టర్ ఎస్.వైష్ణవికృష్ణ, డాక్టర్ జయ కుమార్ లు ఆయా గ్రామాల్లోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశారు. బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్, ప్యానల్ లాయర్ దగ్గుమలి కిరణ్ కుమార్, ఎ.టి.నటరాజన్, ఎస్టీ ట్రైబల్ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు కట్టా శ్రీనివాసరావు, పొందుగల ప్రసాదరావు, తాడికొండ అరుణ, పటాన్ మహమ్మద్ ఖాన్, కనపర్తి రాజారావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి జి. వాణి

నీరుగారుతున్న సచివాలయ ఆశయం



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని పలు వార్డు సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 10 గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉండగా వారు ముందుగా అక్కడికి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురవారం ఉదయం ఆరోవ వార్డు కౌన్సిలర్ కొర్రపాటి శ్రీలక్ష్మి ఆరోవ వార్డు సచివాలయంకు వెళ్లారు. సచివాలయం తెరచి ఉన్నా ఉదయం 11.30 గంటల వరకు ఒక్క ఉద్యోగి కూడా అక్కడ కన్పించలేదు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా విధులకు హాజరు అయినట్లు ఆమె తెలిపారు. అలాగే అయిదో వార్డు సచివాలయంలో కూడా ఉదయం 11 గంటలకు వరకు ఒక్క ఉద్యోగి అందుబాటులో లేరు. 11.30 గంటల నుంచి ఒక్కో ఉద్యోగి వస్తూ కన్పించారని ఆమె ఆరోపించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తే ఉదయం 10 గంటలలోపే అందరు సంతకాలు చేసి వెళ్లిపోయినట్లు తమ పరిశీలనలో తెలినట్లు తెలిపారు. దీని వల్ల వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఉద్యోగులు సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. అయిదు, ఆరోవ వార్డు పరిధిలోని వార్డు సచివాలయంలోని ఉద్యోగులు సమయానికి హాజరు కాలేదని విషయం తన దృష్టికి వచ్చిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

చదరంగం చిన్నారులకు అభినందన

తెనాలి: అంతర్జాతీయ చదరంగం పోటీల్లో ప్రతిభ చూపిన ఇద్దరు చిన్నారులను కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు అభినందించారు. సిక్స్ సిగ్మా అకాడమీలో గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ రేటింగ్ సాధించిన గాజుల మేఘ శ్యామ్‌సాయి, అండర్–7 కేటగిరీలో ప్రతిభ చూపుతున్న ప్రభంజన్‌నాయుడు అడుసుమల్లిని కాంతారావు సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలతఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఎం.నిరంజన్ పాల్గొన్నారు.

ఎర్రజెండా ముద్దు బిడ్డ నాగిరెడ్డి

కొల్లిపర: ఎర్రజెండా ముద్దుబిడ్డ, పేదల పక్షపాతిగా కడవరకు కొల్లిపర మండలంలో కమ్యూనిస్టుగా నిలిచి, అనేకమంది పేదలకు సేవలు అందించి కామ్రేడ్ గుదిబండి నాగిరెడ్డి ధన్యజీవి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో జీవీఆర్ కల్యాణ మండపంలో సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రమాదేవి పాల్గొని సభలో మాట్లాడుతూ కందుకూరి, గురజాడ వంటి నాయకుల ఆశయాలను పుణికిపుచ్చుకున్న నాగిరెడ్డి గతంలో సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా నిలిచి ఆచరణలో అమలు చేసిన అసాధారణ వ్యక్తిగా మండలంలో పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ విధానాలను నమ్మి ఆచరణలో అమలు చేయడం నాగిరెడ్డికే సాధ్య పడిందన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.భావన్నారాయణ మాట్లాడుతూ లోతైన అధ్యయనం, పరిశీలన చేయటమేకాక, కార్యకర్తలకు సాహితకచం అందించి ప్రోత్సహించే వ్యక్తి నాగిరెడ్డి అని అన్నారు. తొలుత నాగిరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో తెనాలి కార్యదర్శి కొల్లిపర బాలు ప్రసాద్ , పి.నరసింహారావు , కోట చంద్రశేఖర్‌రావు, కె.బెన్‌హర్, బాలరాజు, సుబ్బారావు, హుస్సేన్‌వలీ , ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి

అక్షయపాత్ర సేవలు భేష్

జాయింట్ కలెక్టర్ భార్గవతేజ

మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరాలో అక్షయపాత్ర సేవలు భేష్ అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ప్రశంసించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కనున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం తయారీ మిషనరీ, కూరగాయలు, బియ్యం శుభ్రం చేసే విధానం, తయారైన భోజనాన్ని వాహనాల ద్వారా ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అంశాల్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వండిన భోజనాన్ని రుచి చూశారు. నాణ్యతతో పాటు రుచిగా ఉండటం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మావతి, తహసీల్దార్ షేక్ మాబు సుభాని, అక్షయపాత్ర ప్రతినిధులు రామనరేష్ దాస, శ్రీహరి నాయుడు పాల్గొన్నారు.



భోజన తయారీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

12న అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

తెనాలిఅర్బన్: రణరంగ చౌక్ వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. రణరంగచౌక్‌ను గురువారం సాయంత్రం వారు పరిశీలించారు. సభ స్థలిని పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై ఆరా తీసి.. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో తెనాలి ప్రాంత వాసులు ఎందరో అశువులు బాశారని గుర్తు చేశారు. వారిని స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం దీనిని ఏర్పాటు చేయటం జరుతుందన్నారు.

మున్నంగి పీహెచ్‌సీకి ఎన్‌కాస్ సర్టిఫికెట్



తెనాలి: కొల్లిపర మండల గ్రామం మున్నంగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కు 'ఎన్‌కాస్' సర్టిఫికెట్ లభించింది. గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటైన సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక అందుకున్నారు. 'నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్' (ఎన్‌కాస్) ప్రకారం మున్నంగిలోని పీహెచ్‌సీ నిర్వహణకు గల విధివిధానాలను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి పాల్గొన్నారు. ఎన్‌కాస్ సర్టిఫికెట్‌ను స్వీకరించిన డాక్టర్ వేముల ప్రియాంకను తెనాలి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి అభినందించారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

యాజలి(కర్లపాలెం): వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ రామకృష్ణ తెలిపారు. యాజలి రైతు ఉత్పత్తిదారుల సంస్థలో రైతులకు జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ రైతులు సమష్టిగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సహకారంతో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి సాగు చేపట్టడం అభినందనీయమన్నారు. యాజమాన్య పద్ధతులను పాటించి, సాగు చేసిన పంటలకు స్కాప్ ధ్రువీకరణ పత్రం అందజేసి, ఆ పంటలకు అధిక రేటు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మోతాదులో మాత్రమే పైర్లకు ఎరువులు వేయాలని చెప్పారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాజలి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వ్యవస్థాపకుడు ఇక్కుర్తి లక్ష్మీ నారాయణ, ఏవో సుమంత్ కుమార్, ఏఈవో భాగ్యలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ రామకృష్ణ

ఎరువుల యాజమాన్యంలో సూచనలు తప్పనిసరి

కొల్లూరు : ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులు వరి పంటకు ఇష్టానుసారం ఎరువులు వెదజల్లకుండా వ్యవసాయశాఖాధికారుల సూచనల మేరకు వినియోగించాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సయ్యద్ అక్తర్ హుసేన్ సూచించారు. గురువారం మండలంలోని అనంతవరంలో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులకు ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటకు అధిక మోతాదులో ఎరువులను వినియోగించిన పక్షంలో భూమిలోని పంటకు ఉపయోగపడే పోషకాలు నశించడంతోపాటు, రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖాధికారుల నుంచి ఏ తరుణంలో ఎంత మోతాదులో ఎరువులు, పురుగు మందులు వినియోగించాలో తెలుసుకొని వాడితే ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

13న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు



గుర్రం మురళీ మోహన్

భట్టిప్రోలు: 78వ స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 13న ఏపీ సోషల్ స్టడీస్ ఫోరం (ఏపీ ఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ గురువారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు క్విజ్ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ క్విజ్‌లో జిల్లాలో చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుచున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. పాఠశాల నుంచి టీమ్‌కు ముగ్గురు మాత్రమే పాల్గొనాలని, హెచ్‌ఎం, ప్రిన్సిపాళ్ల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. 1857 నుంచి 1947 వరకు స్వాతంత్య్ర ఉద్యమం పోరాటం, కరెంట్ అఫైర్స్‌పై క్విజ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు కన్సోలేషన్ బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. క్విజ్‌లో పాల్గొనదలచిన వారు సెల్–94934 42748 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఈ–క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేయాలి

ఏడీఏ విజయ్‌బాబు

రేపల్లె రూరల్: రైతులు తమ సాగు వివరాలను విధిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆర్.విజయ్‌బాబు అన్నారు. ఈ–క్రాప్ బుకింగ్, పొలం బడి శిక్షణ కార్యక్రమంపై పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)లకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి విపత్తులు సంబవించిన సమయంలో ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా పంట బీమా, కొనుగోలు, రుణాలు లభిస్తాయని, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులని చెప్పారు. రైతులను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించి, చైతన్యవంతుల్ని చేసే బాధ్యత వీఏఏలదేనన్నారు. అదేవిధంగా రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ సాగులో కలిగే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. పొలం బడి కార్యక్రమంలో అవగాహన పొందిన అంశాలను రైతులకు వివరించి అధిక ఉత్పత్తులు సాధించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరం, భట్టిప్రోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం, వేమూరు, కొల్లూరు, మండలాల వ్యవసాయ అధికారులు వి.రమేష్‌బాబు, జి.వీరయ్య, టి.బాలాజీ, కె.శారద, సీహెచ్ సునీత, ఆర్.వెంకటేశ్వరరావు, రేపల్లె హబ్ మేనేజర్ వి.బుష్, ఏఈవోలు, వీఏఏలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌బాబు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు

బాపట్లటౌన్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకమని మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళా ఇంజనీరింగ్, రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉదయం ఇంటి నుంచి వెళ్లిన మనిషి తిరిగి వచ్చేంత వరకు నమ్మకం లేకుండా పోతుందన్నారు. ప్రతి మనిషికి వాహనాలతో అవినాభావ సంబంధం ఏర్పడిందని వివరించారు. ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నప్పటికి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ ర్యాలీలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హెల్మెట్ ధరించకుండా వెళుతున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి, హెల్మెట్ ధరించకుండా వెళ్లడం వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద శాతాన్ని మరణాల సంఖ్యని తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ.హరిత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.కృష్ణకుమారి, జి.కళ్యాణి, విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.